సాక్షి కాకినాడ

సోమవారం । 19 । ఫిబ్రవరి । 2024



కోరుకొండకు ఆధ్యాత్మిక వైభవం


కోరుకొండ శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి పూర్వ వైభవం తెచ్చేందుకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందని మంత్రి చెల్లుబోయిన వేణు, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. - 8లో



రూ.1.12 లక్షల విరాళం

ఆత్రేయపురం: వాడపల్లి వేంకటేశ్వరస్వామి క్షేత్రంలో అన్నదాన భవన నిర్మాణానికి పంచలవరపు కామేశ్వరరావుశర్మ, నాగలక్ష్మి దంపతులు (విజయవాడ) రూ.1.12 లక్షల విరాళం సమర్పించారు.

డెల్టాలకు 8,300 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు ఆదివారం 8,300 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 2,400, మధ్య డెల్టాకు 1,700, పశ్చిమ డెల్టాకు 4,200 క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10 అడుగులుగా నమోదైంది.

న్యూస్‌రీల్

కల్యాణ వైభోగమే..

ప్రారంభమైన కుంతీమాధవుని కల్యాణోత్సవాలు



కుంతీమాధవ స్వామికి ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకులు

పిఠాపురం: దేశంలోని పంచమాధవ క్షేత్రాల్లో ఒకటిగా ఖ్యాతికెక్కిన పిఠాపురం శ్రీ కుంతీ మాధవ స్వామి వారి కల్యాణోత్సవాలు ఆదివారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ నెల 25వ తేదీ వరకూ జరిగే ఈ ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఆలయ అధికారులు విస్తృత ఏర్పాట్లు చేశారు. తొలి రోజు ఆలయంలో ధ్వజారోహణం గావించారు. అనంతరం పిఠాపురం మహారాజా రాజా రావు వేంకట కుమార మహీపతి సూర్యారావు బహుద్దూర్ వారి గోత్రనామాలతో ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం, సాయంత్రం శ్రీచక్ర పెరుమాళ్ల గ్రామోత్సవం నిర్వహించారు. పలువురు భక్తులు స్వామివారిని దర్శించుకుని, తీర్థప్రసాదాలు స్వీకరించారు. స్వామి వారి కల్యాణోత్సవానికి అన్ని ఏర్పాట్లూ పూర్తి చేశామని ఆలయ ఈఓ ఎస్.శ్రీరాములు తెలిపారు.

లోవలో భక్తుల సందడి



తలుపులమ్మ అమ్మవారు

తుని రూరల్: తలుపులమ్మ అమ్మవారిని దర్శించేందుకు వచ్చిన భక్తులతో లోవ దేవస్థానంలో ఆదివారం సందడి నెలకొంది. వివిధ జిల్లాల నుంచి వచ్చిన ఆరు వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారని ఈఓ పెన్మెత్స విశ్వనాథరాజు తెలిపారు. లడ్డూ, పులిహోర ప్రసాదాల విక్రయం, పూజా టికెట్లు, కేశ ఖండన శాల, పూజా టికెట్లు, వసతి గదుల అద్దెలు, విరాళాల రూపంలో అమ్మవారికి రూ.2,13,761 ఆదాయం సమకూరిందని వివరించారు.

కిటకిటలాడిన బాలాజీ సన్నిధి



అప్పనపల్లిలో శ్రీలక్ష్మీనారాయణ హోమం చేస్తున్న అర్చకుడు

మామిడికుదురు: అప్పనపల్లి శ్రీబాల బాలాజీ స్వామి ఆలయం ఆదివారం గోవింద నామస్మరణతో మార్మోగింది. భక్తులు పవిత్ర గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించి శ్రీదేవి, భూదేవి సమేతంగా కొలువు దీరిన ఆ స్వామివారిని దర్శించుకున్నారు. ధ్వజస్తంభం వద్ద దీపాలు వెలిగించి పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు రావడంతో ఆలయం కిటకిటలాడింది. స్వామివారి సన్నిధిలో శ్రీలక్ష్మీ నారాయణ హోమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయానికి రూ.1.54 లక్షల ఆదాయం సమకూరింది. లడ్డూ ప్రసాదం, దర్శనం టిక్కెట్ల ద్వారా రూ.1.03 లక్షలు, నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.50,957 విరాళంగా వచ్చింది. స్వామివారిని 2,638 మంది దర్శించుకోగా, 2,014 మంది అన్న ప్రసాదం స్వీకరించారు. ఈ ఏర్పాట్లను ఆలయ ఈఓ గ్రంధి మాధవి, ట్రస్టు బోర్డు చైర్మన్ చిట్టూరి రామకృష్ణ పర్యవేక్షించారు.

ఈ దూకుడు..సాటెవ్వడు..



- ఎన్నికల వేళ వైఎస్సార్ సీపీలో ఫుల్ జోష్
- ఇప్పటికే సగం స్థానాల్లో సమన్వయకర్తల నియామకం
- బీసీలకు సముచిత స్థానం
- క్షేత్ర స్థాయి ప్రచారంలో ఫ్యాన్ స్పీడు

సాక్షి ప్రతినిధి, కాకినాడ: శరవేగంగా జరుగుతున్న సమన్వయకర్తల మార్పులు, చేర్పులు ఉమ్మడి తూర్పు గోదావరి వైఎస్సార్ సీపీ శ్రేణుల్లో జోష్ నింపుతున్నాయి. ఎన్నికల నోటిఫికేషన్ ఎప్పుడు వెలువడినా అస్త్రశస్త్రాలు, వ్యూహాలతో పార్టీ యంత్రాంగం సర్వసన్నద్ధంగా ఉంది. ఇప్పటికే అన్ని విధాలా సత్తా ఉన్న నేతలకు వివిధ నియోజకవర్గాలకు సమన్వయకర్తలుగా బాధ్యతలు అప్పగించడం, పార్టీ అనుబంధ కమిటీలను మరింత బలోపేతం చేసే దిశగా నియామకాలు జరపడం ద్వారా.. ఎన్నికల రణరంగంలో వైఎస్సార్ సీపీ ముందు వరుసలో నిలిచింది. ఫ్యాన్ స్పీడు చూసి విపక్షాలు బెంబేలెత్తుతున్నాయి. రాజకీయంగా చైతన్యవంతమైన ఉమ్మడి తూర్పు గోదావరిలో మూడు లోక్‌సభ, 21 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. కాకినాడ, రాజమహేంద్రవరం లోక్‌సభ స్థానాలతో పాటు 10 అసెంబ్లీ స్థానాల సమన్వయకర్తల నియామకాన్ని వైఎస్సార్ సీపీ ఇప్పటికే పూర్తి చేసింది. ఈసారి అసెంబ్లీ నియోజకవర్గాల్లో బీసీల ప్రాతినిధ్యం పెంచాలనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచనకు అనుగుణంగా ఆ సామాజికవర్గాల నేతలను నియమిస్తున్నారు.

నూతన సారథులకు పగ్గాలు

- తూర్పు గోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల్లోని మూడు ఎస్సీ రిజర్వ్‌డ్ నియోజకవర్గాలు గోపాలపురం, కొవ్వూరు, పి.గన్నవరాలకు హోం మంత్రి తానేటి వనిత, ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, పూర్వపు అవిభక్త తూర్పు గోదావరి జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావులను సమన్వయకర్తలుగా నియమించారు.
- గత సార్వత్రిక ఎన్నికల్లో రాజమహేంద్రవరం సిటీ, రాజమహేంద్రవరం రూరల్ స్థానాల నుంచి కాపు సామాజికవర్గం నుంచి రౌతు సూర్యప్రకాశరావు, డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజులను బరిలోకి దింపారు. బీసీలకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలనే సీఎం జగన్ ఆలోచనలకు అనుగుణంగా ఈసారి రాజమహేంద్రవరం సిటీ, రూరల్ నుంచి బీసీలకు ప్రాతినిధ్యం కల్పించారు. రూరల్‌కు బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణను, సిటీకి ఎంపీ మార్గాని భరత్‌రామ్‌ను సమన్వయకర్తలుగా నియమించారు.
- డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం సమన్వయకర్త బాధ్యతలను రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్ తనయుడు పిల్లి సూర్యప్రకాష్‌కు అప్పగించారు.
- వీటితో పాటు కాకినాడ లోక్‌సభ, కాకినాడ జిల్లాలో నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాలకు సమన్వయకర్తల నియామకాన్ని వైఎస్సార్ సీపీ పూర్తి చేసింది.
- వైఎస్సార్ సీపీ అధినేత, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కాకినాడ ఎంపీ స్థానంపై తొలి నుంచీ వస్తున్న సంప్రదాయాన్నే కొనసాగిస్తూ కాపు సామాజికవర్గం నుంచి సమన్వయకర్తను ఎంపిక చేశారు. మెట్ట ప్రాంతంలో బంధుత్వాలతో పాటు అనేక మంది సన్నిహితులున్న వ్యాపారవేత్త, వైఎస్సార్ సీపీ నాయకుడు చలమలశెట్టి సునీల్‌ను పార్లమెంటరీ కో ఆర్డినేటర్‌గా నియమించారు. ఆయన రెండు రోజుల క్రితమే ముహూర్తం చూసుకుని అన్నవరం సత్యదేవుని ఆశీస్సులతో జిల్లాలో అసెంబ్లీ నియోజకవర్గాల పర్యటనలకు శ్రీకారం చుట్టారు.
- రాజమహేంద్రవరం పార్లమెంటరీ స్థానానికి సమన్వయకర్తగా ప్రముఖ వైద్యులు గూడూరి శ్రీనివాస్‌ను ఎంపిక చేశారు. ఈసారి ఈ స్థానం నుంచి బీసీల్లో బలమైన శెట్టిబలిజ సామాజికవర్గానికి ప్రాతినిధ్యం కల్పించాలనే సంకల్పంతో ఇప్పటికే రాజమహేంద్రవరం సిటీ కో ఆర్డినేటర్‌గా ఉన్న గూడూరిని సీఎం జగన్ పార్లమెంటరీ కో ఆర్డినేటర్‌గా నియమించారు.
- అసెంబ్లీలో మహిళల ప్రాతినిధ్యం పెంచాలనే సంకల్పంతో గోపాలపురంలో హోం మంత్రి తానేటి వనితను నియమించగా, కాకినాడ ఎంపీ వంగా గీతను పిఠాపురం అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్తగా ఎంపిక చేశారు.
- కాకినాడ జిల్లా మెట్ట ప్రాంతంలోని ప్రత్తిపాడుకు మాజీ ఎమ్మెల్యే వరుపుల సుబ్బారావును, జగ్గంపేటకు మాజీ మంత్రి తోట నరసింహాన్ని కో ఆర్డినేటర్లుగా నియమించారు.
- పెద్దాపురం నియోజకవర్గ సమన్వయకర్త దవులూరి దొరబాబును వచ్చే ఎన్నికల్లో గెలిపించుకోవాలని కొద్ది రోజుల కిందట పెద్దాపురంలో జరిగిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్వయంగా ప్రజలకు పిలుపునిచ్చారు.

ప్రచారంలో బిజీ

ఇప్పటికే సమన్వయకర్తలుగా నియమితులైన నేతలు నిత్యం ప్రజలతో మమేకమవుతున్నారు. ఒకవిధంగా చెప్పాలంటే మిగిలిన పార్టీలకంటే ముందుగానే ప్రచారానికి శ్రీకారం చుట్టారు. ఉరకలెత్తే ఉత్సాహంతో ఎన్నికలకు సిద్ధమనే రీతిలో దూకుడుగా దూసుకుపోతున్నారు. ఆయా నియోజకవర్గాల్లో విస్తృతంగా పర్యటిస్తున్నారు. నాయకులను, కార్యకర్తలను, ప్రజలను కలిసి, మద్దతు కూడగడుతున్నారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేసిన కృషిని విశ్లేషిస్తూ, గెలుపు ఆవశ్యకతను వివరిస్తున్నారు. నాలుగున్నరేళ్లకు పైగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలతో చేకూరిన లబ్ధిని వివరిస్తున్నారు. దీంతో వారిని పల్లెలు, పట్టణాలనే తేడా లేకుండా ప్రజలు చిరునవ్వుతో స్వాగతిస్తున్నారు.

సీట్ల సిగపట్లలో విపక్షం

- టీడీపీ, జనసేనల్లో తెగని పొత్తుల పంచాయితీ

వైఎస్సార్ సీపీ అన్నింటా ముందుకు దూసుకుపోతూంటే విపక్ష టీడీపీ, జనసేన పార్టీలు ఎడతెగని పొత్తులతో, సీట్ల సిగపట్లతో కొట్టుమిట్టాడుతున్నాయి. దీంతో ఆ పార్టీల శ్రేణుల్లో నిస్తేజం ఆవహించింది. కాకినాడ, అమలాపురం, రాజమహేంద్రవరం లోక్‌సభ స్థానాల్లో ఏ ఒక్కచోటా అభ్యర్థిని ప్రకటించలేని దుస్థితిలో ఆ రెండు పార్టీలు ఉన్నాయి. టీడీపీకి సిట్టింగ్ ఎమ్మెల్యేలున్న పెద్దాపురం, రాజమహేంద్రవరం సిటీ, రాజమహేంద్రవరం రూరల్ స్థానాల్లో సైతం బరిలో నిలిపే వారిపై ఆ పార్టీలో ఇప్పటికీ గందరగోళమే కనిపిస్తోంది. కాకినాడ జిల్లాలో మూడంటే మూడు తుని, జగ్గంపేట, ప్రత్తిపాడు నియోజకవర్గాల్లో మాత్రమే కాస్త స్పష్టత ఇవ్వగలిగారు. కోనసీమ, తూర్పు గోదావరి జిల్లాల్లో మూడు వంతుల నియోజకవర్గాల్లో ఇంకా సందిగ్ధావస్థ కొనసాగుతోంది. ఈ పొత్తులు ఎప్పుడు తేలతాయి, సీట్ల కేటాయింపు ఎప్పటికి పూర్తవుతుందో తెలియని అయోమయం టీడీపీ, జనసేన శ్రేణుల్లో స్పష్టంగా కనిపిస్తోంది.

నేడు జిల్లా స్థాయి స్పందన

కాకినాడ సిటీ: జగనన్నకు చెబుదాం – జిల్లా స్థాయి స్పందన కార్యక్రమం సోమవారం ఉదయం 9.30 గంటలకు కలెక్టరేట్‌లో ప్రారంభమవుతుందని కలెక్టర్ కృతికా శుక్లా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు, జిల్లా అధికారులు ఈ విషయం గమనించాలని కోరారు.

విజయమివ్వు వినాయకా..



ప్రత్యేక అలంకరణలో అయినవిల్లి విఘ్నేశ్వరస్వామి

అయినవిల్లి: విజయమివ్వు వినాయకా అంటూ అయినవిల్లిలోని విఘ్నేశ్వర స్వామివారిని భక్తులు కొలిచారు. ఆదివారం ఉదయం ఆలయ ప్రధానార్చకుడు అయినవిల్లి సూర్యనారాయణ మూర్తి ఆధ్వర్యంలో స్వామివారికి మేలుకొలుపు సేవ, వివిధ పూజలు నిర్వహించారు. అనంతరం వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. స్వామివారి లఘు న్యాస అభిషేకాలు, లక్ష్మీగణపతి హోమంలో అధిక సంఖ్యలో భక్త దంపతులు పాల్గొన్నారు. పంచామృత, ప్రత్యేక అభిషేకాల్లో 45 మంది, ప్రత్యేక దర్శనంలో 583 మంది, శ్రీలక్ష్మీ గణపతి హోమంలో 23 మంది పాల్గొని పూజలు చేశారు. 35 మంది నూతన వాహన పూజలు, 63 మంది చిన్నారులకు నామకరణలు, అక్షరాభ్యాసాలు జరిగాయి. 12 మంది తలనీలాలు సమర్పించారు. స్వామి వారికి వివిధ పూజలు, అన్నదాన విరాళాలుగా రూ.2,52,910 ఆదాయం సమకూరిందని ఆలయ ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు, చైర్మన్ గుత్తుల నాగబాబు తెలిపారు.

సీఎంగా జగన్‌ను మళ్లీ ఎన్నుకుందాం

- మంత్రి దాడిశెట్టి రాజా
- సచివాలయం, మంచినీటి పథకాలకు ప్రారంభోత్సవం
- రూ.1.09 కోట్లతో నిర్మాణం



ఎస్.చామవరంలో సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి దాడిశెట్టి రాజా

తుని రూరల్: జరుగుతున్న అభివృద్ధిని, అందుతున్న సంక్షేమాన్ని ప్రతి ఒక్కరూ గమనించాలని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించాలని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా విజ్ఞప్తి చేశారు. మండలంలోని ఎస్.చామవరంలో రూ.43.60 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని, రూ.65.68 లక్షలతో నిర్మించిన రక్షిత మంచినీటి పథకాలను ఆయన ఆదివారం ప్రారంభించి, శిలాఫలకాలను ఆవిష్కరించారు. ఇంటింటా కుళాయిలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, అభివృద్ధి అంటే ప్రజలకు కనీస అవసరాలైన రోడ్లు, కాలువలు, తాగునీటి ట్యాంకులు, ప్రభుత్వ కార్యాలయాలు నిర్మించడమని అన్నారు. పేదలను, అణగారిన వర్గాలను ఆదుకునేందుకు తమ ప్రభుత్వం గతంలో ఎన్నడూ లేని రీతిలో వినూత్న సంక్షేమ పథకాలు అందిస్తోందని చెప్పారు. ఇటువంటి పనులు ప్రతి గ్రామంలో జరిగినా కళ్లుండీ ప్రతిపక్ష నాయకులతో పాటు ఎల్లో మీడియా చూడలేకపోతోందని దుయ్యబట్టారు. ఈ అభివృద్ధిని, సంక్షేమాన్ని ప్రజలు గమనిస్తున్నారని చెప్పారు. దశాబ్దాలుగా గ్రామీణులు ఎదుర్కొంటున్న తాగునీరు వంటి కనీస సమస్యలను పరిష్కరించలేనందుకు టీడీపీ నాయకులు సిగ్గుపడాలని విమర్శించారు.

చంద్రబాబు జీవితమంతా అబద్ధాలే..

డ్వాక్రా రుణమాఫీ చేస్తానని 2014లో చంద్రబాబు మహిళలకు ఇచ్చిన హామీలన్నీ నీటి మూటలే అయ్యాయని మంత్రి దాడిశెట్టి రాజా గుర్తు చేశారు. మాట మీద నిలబడని చంద్రబాబు జీవితమంతా అబద్ధాలతోనే నడుస్తోందని విమర్శించారు. దీనికి భిన్నంగా నాలుగు విడతల్లో డ్వాక్రా రుణమాఫీ చేస్తానని ఇచ్చిన హామీని సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలబెట్టుకున్నారని చెప్పారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కరోనాతో రెండేళ్లు ఇబ్బందులు ఎదుర్కొన్నామని, ఈ మూడేళ్లలో అద్భుతమైన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు అందించిన ఘనత సీఎం జగన్‌కే దక్కిందని అన్నారు. మరోసారి ఆయనను గెలిపించుకుని, గ్రామాన్ని, రాష్ట్రాన్ని మరింతగా అభివృద్ధి చేసుకుందామని పిలుపునిచ్చారు. రాష్ట్రాన్ని సీఎం జగన్ దేశంలోనే నంబర్ వన్‌గా తీర్చిదిద్దుతారన్న నమ్మకం ఉందన్నారు.

అధికారం కక్షలు తీర్చుకునేందుకు కాదు

నియోజకవర్గ ప్రతిపక్ష నాయకులు ప్రజలను భయభ్రాంతులకు గురి చేసేందుకు యత్నిస్తున్నారని, ఎర్ర బుక్‌లో, డైరీలో రాసుకున్నామంటూ మాట్లాడుతున్నారని మంత్రి రాజా విస్మయం వ్యక్తం చేశారు. మంచిగా పరిపాలిస్తే ప్రజలే మళ్లీమళ్లీ గెలిపిస్తారన్నారు. అధికారం ఉంటే మీ అంతు చూస్తాం అంటున్నారని, వారు అధికారంలోకి రారని స్పష్టం చేశారు. తాను ప్రతిపక్ష ఎమ్మెల్యేగా ఉండగా వారు ఇల్లు, వాకిలి వదిలేసి భార్యాపిల్లలతో నాలుగు రోజులు ఇతర రాష్ట్రాలకు పారిపోయి దాక్కున్నారని గుర్తు చేశారు. ప్రజలు అధికారం ఇచ్చేది కక్షలు తీర్చుకునేందుకు కాదని, పేదలకు సాధ్యమైనంత మేలు చేయాలని హితవు పలికారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఏ గ్రామంలోనూ కక్షలు, పోలీసు కేసులు లేకపోవడమే దీనికి ఉదాహరణ అని మంత్రి అన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మాకినీడి బాబు, తాండవ షుగర్స్ మాజీ చైర్మన్ నాగం దొరబాబు, నాయకులు పోతల రమణ, బొంగు ఉమారావు పాల్గొన్నారు.

సెప్సిస్‌పై యుద్ధం

- ఐఎస్‌సీసీఎం నిపుణుల పిలుపు
- కాకినాడలో అవగాహన కార్యక్రమం



సెప్సిస్‌పై వివరిస్తున్న వైద్యులు

కాకినాడ క్రైం: సెప్సిస్‌పై యుద్ధం ప్రకటించాల్సిన సమయం ఆసన్నమైందని ఇండియన్ సొసైటీ ఆఫ్ క్రిటికల్ కేర్ మెడిసిన్ (ఐఎస్‌సీసీఎం) నిపుణులు పిలుపునిచ్చారు. సెప్సిస్‌పై ఐఎస్‌సీసీఎం కాకినాడ యూనిట్ చైర్మన్ డాక్టర్ ఎస్‌వీ లక్ష్మీనారాయణ, కార్యదర్శి, ట్రస్ట్ ఆసుపత్రి ఎండీ డాక్టర్ ఎస్‌సీహెచ్‌ఎస్ రామకృష్ణ అధ్యక్షతన నగరంలోని ఓ హోటల్‌లో ఆదివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వైద్యులు లక్ష్మీనారాయణ, రామకృష్ణతో పాటు ఐఎస్‌సీసీఎం నగర కోశాధికారి డాక్టర్ ఉజ్జిన కిషోర్‌కుమార్ మాట్లాడుతూ, చిన్నపాటి గాయం లేదా అపరిశుభ్రత వలన శరీరంలోకి ప్రవేశించే ఇన్ఫెక్షన్ క్రమంగా వృద్ధి చెంది, శరీర వ్యవస్థలపై దాడి చేయడమే సెప్సిస్ అని వివరించారు. దీనివలన శరీర వ్యవస్థలన్నీ ఛిన్నాభిన్నమై, అవయవాల పనితీరు క్షీణిస్తుందని తెలిపారు. ప్రతి వంద మందిలో 32 మరణాలకు సెప్సిస్ కారణమవుతోందని వెల్లడించారు. చిన్నపాటి నిర్లక్ష్యాల ఫలితమే సెప్సిస్‌కు దారి తీసే ప్రధాన కారణమని తెలిపారు. ఎంత చిన్న గాయం తగిలినా వైద్యుల పర్యవేక్షణలోనే మందులు తీసుకోవాలని, అలా కాకుండా స్థానిక మందుల దుకాణంలో ఔషధాలు కొనుగోలు చేసి వినియోగించడం వలన హయ్యర్ యాంటీ బయాటిక్స్ ప్రతికూల ప్రభావాలకు గురవుతున్నారని అన్నారు. శరీర స్థితిగతులతో పాటు అనారోగ్యతత్వానికి అనుగుణంగా యాంటీ బయాటిక్ ఎంచుకోవాల్సి ఉంటుందని, దీనిని వినియోగించేందుకు కూడా నిర్దిష్ట వ్యవధి ఉంటుందని చెప్పారు. ఇవేవీ పాటించకుండా మందుల దుకాణంలో కొని తెచ్చుకొని వినియోగిస్తే, శరీరంలో ఇన్ఫెక్షన్ మరింత విస్తరిస్తుందని అన్నారు. తద్వారా అవయవాలు విఫలం కావచ్చని హెచ్చరించారు. పరిశుభ్రతతో కూడిన జీవన శైలి సెప్సిస్‌ను దూరం చేస్తుందని వెల్లడించారు. అప్పుడే పుట్టిన పిల్లల నుంచి వృద్ధులు, విదేశీ ప్రయాణికుల వరకూ ప్రతి ఒక్కరికీ నిర్దేశించిన టీకాలు వేసుకోవడం ద్వారా ప్రాణాంతక సెప్సిస్‌ను నివారించవచ్చని డాక్టర్ రామకృష్ణ వివరించారు. కోవిడ్ వేళ అనుసరించిన జాగ్రత్తలన్నీ సదా అనుసరణీయమని హితవు పలికారు. వివిధ అంశాలను కాకినాడ సిద్ధార్థ ఆసుపత్రి పల్మనాలజిస్టు డాక్టర్ ముత్తా వంశీకృష్ణ, ట్రస్ట్ ఆసుపత్రి నర్సింగ్ సూపరింటెండెంట్ మహాలక్ష్మి వివరించారు. పలు సందేహాలను నిపుణులు నివృత్తి చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ ఆసుపత్రి ఇంటెన్సివిస్ట్ డాక్టర్ సందీప్, దంత వైద్య నిపుణుడు డాక్టర్ అడ్డాల సత్యనారాయణ, ఐఎంఏ కాకినాడ యూనిట్ నుంచి డాక్టర్ చిట్ల కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

మంగళకరమ్మై..

ముల్లోక కల్యాణమై..

- లోక కల్యాణానికి నేడే సుముహూర్తం
- అంతర్వేదిలో స్వామికి రాత్రి 12.29 గంటలకు పరిణయం
- పంచముఖ ఆంజనేయస్వామి, కంచుగరుడ వాహనాలపై సేవ

సఖినేటిపల్లి: కల్యాణ తిలకం దిద్దిన నరసింహుడు పూలమాల వేయగా.. పెండ్లి కుమార్తెలై పల్లకిలో వచ్చిన అమ్మవార్లు ఆనందంతో మురవగా.. అక్షతలు పన్నీటి జల్లులై కురవగా.. మంగళ వాయిద్యాలు మంగళకరంగా మోగగా.. ముహూర్తం తథాస్తు అని శుభం పలకగా.. అంతర్వేదిలో స్వామివారి మూడు ముడుల వేడుక సోమవారం జరిగేను అత్యంత వైభవంగా.. శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా కీలకఘట్టం ఆవిష్కృతం కానుంది. ఉత్సవాల్లో నాలుగో రోజు దశమి సోమవారం రాత్రి 12.29 గంటలకు ఆరుద్రా నక్షత్ర యుక్త వృశ్చిక లగ్న పుష్కరాంశంలో శ్రీదేవీ, భూదేవీ అమ్మవార్లతో శ్రీస్వామివారి కల్యాణాన్ని కనుల పండువగా నిర్వహించనున్నారు. కల్యాణ మహోత్సవం తర్వాత రోజు 20వ తేదీ జయవారం మధ్యాహ్నం 2.05 గంటలకు భీష్మ ఏకాదశి పర్వదినాన జరిగే రథోత్సవానికి అధిక సంఖ్యలో భక్తులు వస్తారని అధికారులు అంచనా వేస్తూ సకల సౌకర్యాలూ కల్పిస్తున్నారు.

కల్యాణ క్రతువు జరిగేదిలా..

సోమవారం సాయంత్రం 4 గంటలకు పంచముఖ ఆంజనేయస్వామి వాహనంపై, రాత్రి 7 గంటలకు కంచుగరుడ వాహనంపై స్వామివారు ఊరేగుతారు. ఈ గ్రామోత్సవాల తర్వాత రాత్రి ఎదురు సన్నాహంతో కల్యాణ మంటపం వద్ద కల్యాణ క్రతువు ప్రారంభిస్తారు. పశ్చిమ గోదావరి జిల్లా మొగల్తూరుకు చెందిన ఆలయ వ్యవస్థాపక కుటుంబ సభ్యుడు శ్రీరాజా కలిదిండి కుమారరామ గోపాలరాజా బహద్దూర్ వరుడి తరఫున, దేవస్థానం, అర్చకస్వాములు వధువుల తరఫున ఎదురు సన్నాహంలో పాల్గొంటారు. తర్వాత ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ, ప్రధాన అర్చకుడు పాణింగిపల్లి శ్రీనివాస కిరణ్ ఆధ్వర్యంలో స్థానాచార్య వింజమూరి రామరంగాచార్యులు పర్యవేక్షణలో వేదపండితుడు చింతా వెంకటశాస్త్రి, అర్చకస్వాములు కల్యాణ మంటపానికి వధూవరులను తోడ్కొని వస్తారు. తదనంతరం అర్చకులు కల్యాణోత్సవానికి శ్రీకారం చుడతారు. రాజా బహద్దూర్, దేవదాయశాఖ, ప్రభుత్వ ప్రతినిధిగా ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ మధుపర్కాలను అందజేస్తారు. సుముహూర్తానికి ప్రధాన అర్చకుడు శ్రీనివాస కిరణ్ జీలకర్ర, బెల్లాన్ని స్వామివారి శిరస్సుపై, సహాయ అర్చకులు శ్రీదేవీ, భూదేవీ అమ్మవార్ల శిరస్సులపై ఉంచుతారు. పాణిగ్రహణానంతరం కన్యాదానం జరుగుతుంది. ఆనవాయితీగా పశ్చిమ గోదావరి జిల్లా పాలమూరు వాస్తవ్యులు తలంబ్రాల బియ్యంతోపాటు, మంచి ముత్యాలు, పగడాలు, పసుపు, కుంకుమలు అందజేస్తారు. వీటిలోని బంగారు మంగళసూత్రాలు, వెండి ఉత్తరజంధ్యాలకు అర్చకులు వేదమంత్రాలతో పూజలు చేసి, అనంతరం అమ్మవార్లకు మంగళసూత్రధారణ గావిస్తారు. ముందుగా అర్చకులు స్వామి, అమ్మవార్ల శిరస్సులపై తలంబ్రాలు వేస్తారు. తరువాత రాజా బహద్దూర్, పాలమూరు రాజులు తలంబ్రాలను స్వామి, అమ్మవార్ల పాదాల చెంతన ఉంచుతారు. బ్రహ్మముడి వేసి, చమ్కీ పూల దండలను సమర్పిస్తారు. మంగళహారతులు ఇచ్చి కల్యాణమూర్తులకు అర్చకులు ఆశీర్వచనాలు పలకడంతో కల్యాణ క్రతువు ముగుస్తుంది. స్వామి, అమ్మవార్లకు అన్నవరం, తిరుపతి దేవస్థానాల నుంచి పట్టు వస్త్రాలు సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది. కల్యాణ మహోత్సవం అనంతరం జయవారం తెల్లవారుజామున 3 గంటల నుంచి ఆలయంలో శ్రీస్వామి, అమ్మవార్ల దర్శనం యథాతథంగా కొనసాగుతుందని ప్రధాన అర్చకుడు శ్రీనివాస కిరణ్ తెలిపారు.

ఎప్పటిలాగే వన్‌వే

ఎప్పటిలాగే తీర్థంలో వాహన రాకపోకలకు పోలీసులు వన్‌వేను అమలు చేస్తున్నారు. వేర్వేరు ప్రాంతాల నుంచి అంతర్వేదికి వచ్చే వాహనాలు టేకిశెట్టిపాలెం వద్ద ప్రధాన రహదారిలో కేశవదాసుపాలెం మీదుగా రావొచ్చు. తిరుగు ప్రయాణంలో ఆలయం వెనుక వైపున ఏటిగట్టు మీదుగా గొంది, గుడిమూల, సఖినేటిపల్లి సెంటర్ నుంచి మలికిపురం, రాజోలు తదితర ప్రాంతాలకు ప్రయాణించవచ్చు. వీటితో పాటు భక్తుల వాహనాలకు గుర్రాలక్క గుడికి సమీపంలో పార్కింగ్ స్థలాల నుంచి గుర్రాలక్క గుడి మీదుగా ఉన్న దండుపుంత మార్గంలో అంతర్వేదికర వద్ద మలుపు తిరిగి, గంగయ్య వారధి మీదుగా సఖినేటిపల్లి మూడుతూముల సెంటర్ వద్ద ప్రధాన రహదారి పైకి వెళ్లవచ్చు. కల్యాణ మహోత్సవాల సందర్భంగా భక్తుల రద్దీకి అనుగుణంగా అమలాపురం, రాజోలు, భీమవరం, నరసాపురం, పాలకొల్లు డిపోల బస్సులు నడపనున్నారు.



అంతర్వేదిలో విద్యుత్ కాంతుల నడుమ ఆలయం (ఫైల్) (అంతర చిత్రం) లక్ష్మీనరసింహస్వామి

గెస్ట్‌హౌస్ వద్ద కమాండ్ కంట్రోల్ రూమ్

భక్తుల భద్రతకు, అత్యవసర సమయాల్లో సమాచార ఇబ్బందులు లేకుండా స్థానిక టూరిజం గెస్ట్‌హౌస్ వద్ద కమాండ్ కంట్రోల్ రూమ్‌ను ఉన్నతాధికారులు ఏర్పాటు చేశారు. 100కు పైబడి సీసీ కెమెరాలను, వాకీటాకీలను పోలీసు శాఖ సమన్వయంతో తీర్థంలో వాడనున్నారు. అలాగే అత్యంత రద్దీగా ఉండే ప్రాంతాల్లో డ్రోన్ కెమెరాలను వినియోగిస్తారు. తీర్థంలో పటిష్ట నిఘాతో ఎక్కడ చిన్న సంఘటన జరిగినా భక్తులకు, అధికారులకు తక్షణం సమాచారం చేరేవిధంగా ఈ వ్యవస్థలను కలెక్టర్ హిమాన్షు శుక్లా, జిల్లా ఎస్పీ శ్రీధర్ ఆదేశాలపై కొత్తపేట డీఎస్పీ కేవీ రమణ, అమలాపురం ఆర్డీఓ కేశవవర్ధన్‌రెడ్డి సూచనలతో కింది స్థాయి అధికారులు ఏర్పాటు చేస్తున్నారు. అంతర్వేది లక్ష్మీనృసింహుని కల్యాణ మహోత్సవాల రూట్ మ్యాప్‌ను పోలీసులు విడుదల చేశారు.

భక్తుల భద్రతకు ప్రాధాన్యం

అంతర్వేదిలో బీచ్, సాగర సంగమం వంటి అత్యంత ప్రాధాన్య ప్రాంతాల్లో ఎస్పీ శ్రీధర్ ఆదేశాలపై కొత్తపేట డీఎస్పీ రమణ పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. వివిధ జిల్లాల నుంచి వివిధ స్థాయిల్లోని 1,600 మంది పోలీసు సిబ్బంది విధుల్లో నిర్వర్తించనున్నారు. ఇందులో 10 మంది డీఎస్పీలు, 40 మంది సీఐలు, 140 మంది ఎస్సైలు, 1,400 మంది కానిస్టేబుల్స్, మరికొంత మంది హోంగార్డు లు విధుల్లోకి పాల్గొంటారు. కాగా బీచ్ వద్ద భక్తుల రక్షణకు ఫిషరీష్ ఆధ్వర్యంలో గజ ఈతగాళ్లను, స్పీడ్ బోట్లను అందుబాటులో ఉంచుతున్నారు. పైఅధికారుల ఆదేశాలతో బీచ్‌లో రక్షణకు ప్రత్యేక బారికేడ్లు ఏర్పాటు చేస్తున్నారు.

ఎక్కడా మాట రాకుండా..

ఎక్కడా మాట రాకుండా తీర్థంలో ఆయా శాఖలు తగిన చర్యలు తీసుకుంటున్నాయి. ఆలయం వద్ద రథం షెడ్డుకు చేర్చి రాజోలు సీఐ గోవిందరాజు నేతృత్వంలో అవుట్ పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేశారు. తీర్థంలో భక్తులకు దీని ద్వారా మరిన్ని సేవలు అందజేస్తామని ఆయన చెప్పారు. 300 మంది కార్మికులను పారిశుధ్య పనులకు వినియోగిస్తున్నారు. 62 మొబైల్ టాయిలెట్స్, బీచ్‌లో 100 మంది గజ ఈతగాళ్లను నియమిస్తున్నారు. ఆరోగ్య శాఖ 6 మెడికల్ టీమ్‌లు, రెండు 108 వాహనాలు ఏర్పాటు చేస్తుంది. ఆర్టీసీ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా నుంచి 30 బస్సులు, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి 60 బస్సులు భక్తులకు కోసం సిద్ధం చేసింది.

హెల్ప్‌లైన్ నంబర్లు ఇవీ

టూరిజం	08862-221500
పోలీసు	100
సఖినేటిపల్లి ఎస్సై	94407 96566
రాజోలు సీఐ	94407 96526
తహసీల్దార్	98499 03893
వీఆర్వో	97018 35669
ఎంపీడీఓ	99892 13666
అంతర్వేది కార్యదర్శి	94930 62920
మెడికల్	
డాక్టర్ యునస్	87922 57516
స్వామి	77802 35621
దేవస్థానం సిబ్బంది	
సారథి	94403 42192
పాపారావు	91774 90400
రాజోలు ఆర్టీసీ ఎంక్వయిరీ	08862-221057
రాజోలు ఎక్సైజ్ శాఖ	97047 79056

క్లుప్తంగా

21న విమాన వేంకటేశ్వరుని విగ్రహ ప్రతిష్ఠ



విమాన వేంకటేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠకు ఏర్పాట్లు చేస్తున్న సిబ్బంది

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంపై ఈ నెల 21న ఉదయం 10.30 గంటలకు విమాన వేంకటేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈఓ భూపతిరాజు కిశోర్‌కుమార్ తెలిపారు. ఈ ఏర్పాట్లను ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 20న ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి, 21న విమాన వేంకటేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ చేస్తామన్నారు. స్వామివారి ఆలయానికి రోజురోజుకూ భక్తుల తాకిడి పెరుగుతుందన్నారు. దీంతో ఆలయ అభివృద్ధికి అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. అలాగే ఆదివారం స్వామివారిని మహరాజ పోషకుడు నడింపల్లి కృష్ణంరాజు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు ఆలయ ఈఓ చేతుల మీదుగా స్వామివారి చిత్రపటం అందించారు. ఆలయ పర్యవేక్షకులు రాపాక శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

కాకినాడ రూరల్: తిమ్మాపురం గ్రామంలో గుర్తు తెలియని వ్యక్తి (35) మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామంలోని ఎస్సీపేట వెనుక ఖాళీ స్థలంలో పూర్తిగా కుళ్లిన స్థితిలో ఉన్న వ్యక్తి మృతదేహం లభ్యమైంది. మృతదేహం ఉన్న ప్రాంతంలో నీరు నిలిచి ఉంది. సుమారు మూడు రోజులు కిందట చనిపోయి ఉంటాడని భావిస్తున్నారు. మృతదేహాన్ని ఎస్సై రవీంద్రబాబు, తిమ్మాపురం సర్పంచ్ బెజవాడ సత్యనారాయణ పరిశీలించారు. మృతుడి ఒంటిపై బిస్కెట్ రంగు చొక్కా, నలుపు రంగు ఫ్యాంట్ ఉన్నాయి. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. మూడు రోజుల పాటు మార్చురీలో ఉంచి తరువాత అంత్యక్రియలు నిర్వహిస్తామని పోలీసులు తెలిపారు.

పురుగు మందు తాగిన వ్యక్తి మృతి

రాజానగరం: మద్యం అనుకుని పురుగు మందు తాగి, ఆసుపత్రిలో చేరిన వ్యక్తి చివరకు ఆదివారం మృతి చెందాడు. తొర్రేడులో ఈ సంఘటన జరిగింది. దీనికి సంబంధించి పోలీసుల కథనం ప్రకారం.. తొర్రేడుకు చెందిన కర్రి వీర్రాజు (50) వ్యవసాయ అవసరాల కోసం పురుగు మందును ఇంట్లో ఉంచాడు. అయితే అతను మద్యాన్ని కూడా ఇంట్లో నిల్వ ఉంచుకుంటాడు. 4న మద్యం తాగి ఇంటికి వచ్చిన అతనికి కొద్దిసేపటికి మరోసారి మద్యం తాగాలనిపించింది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో అప్పటికే ఫుల్‌గా తాగివున్న మత్తులో మద్యం బాటిల్ అనుకుని పురుగు మందు తాగాడు. ఇంతలో కుటుంబ సభ్యులు రావడం, అతను తాగింది పురుగు మందు అని తెలుసుకుని వెంటనే రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ ఆయన చికిత్స పొందుతూ మృతి చెందాడు.

కోరుకొండకు ఆధ్యాత్మిక వైభవం

- మంత్రి చెల్లుబోయిన వేణు, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- రంగనాథస్వామి ఆలయ పునర్నిర్మాణం, నారసింహుని ఆలయ మెట్ల మార్గానికి శంకుస్థాపన
- అంకురార్పణ చేసిన చిన జీయర్ స్వామి



నారసింహస్వామి ఆలయం వద్ద అభివృద్ధి పనులకు శ్రీకారం చుడుతున్న చినజీయర్ స్వామి, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా



కాపవరంలో అగ్నిమాపక కేంద్రాన్ని ప్రారంభించిన మంత్రులు తానేటి వనిత, వేణుగోపాలకృష్ణ, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

మధురపూడి: శ్రీలక్ష్మీనరసింహస్వామి కొలువైన కోరుకొండ ఆలయానికి పూర్వ వైభవం తెచ్చేందుకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందని జిల్లా ఇన్‌చార్జి మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. ఆదివారం కోరుకొండలో రూ.1.40 కోట్లతో రంగనాథస్వామి ఆలయ పునర్నిర్మాణం, రూ.60 లక్షలతో నారసింహుని ఆలయ మెట్ల అభివృద్ధి పనులు, రూ.3.80 కోట్లతో గ్రామంలో సీసీ రోడ్లు, డ్రైన్ల పనులకు శంకుస్థాపనలు ఎమ్మెల్యే రాజా సారథ్యంలో జరిగాయి. ఈ పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలను త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చినజీయర్ స్వామి చేశారు. తొలుత కోరుకొండ లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో ఆయన భక్తులకు అనుగ్రహ భాషణం గావించారు. కొత్త ఆలయాలను నిర్మించడం కంటే, ఉన్నవాటికే నూతనత్వం తీసుకువస్తే పురాణ ప్రాశస్త్యాన్ని భవిష్యత్తు తరాలకు అందించవచ్చని అన్నారు. మంత్రి వేణుగోపాలకృష్ణ మాట్లాడుతూ టీటీడీ, శ్రీవాణి ట్రస్టు ఆధ్వర్యంలో రూ.1.40 కోట్లతో శ్రీరంగనాథ స్వామి ఆలయ పునర్నిర్మాణం చేయడం మహత్తర కార్యమన్నారు. దీనికి ముందు స్థానిక రంగనాథ స్వామి ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా కళాపకర్షణ, మహా సంప్రోక్షణ జరిగింది. కోరుకొండలో ఎమ్మెల్యే రాజా నిర్మించుకున్న ఇంట్లో స్వామీజీ భక్తులకు తీర్థగోష్టి నిర్వహించారు. వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి మాట్లాడుతూ భగవన్నామ స్మరణతోనే మానవునికి ముక్తి మార్గం లభిస్తోందన్నారు. కోరుకొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి ఎంతో విశిష్టత ఉందని, తిరుమలలోని వేంకటేశ్వరస్వామి కల్యాణానికి పట్టువస్త్రాలు, తలంబ్రాలను ఈ క్షేత్రం నుంచే వెళ్లేవని పెద్దలు చెబుతున్నారన్నారు. తిరిగి ఆ వైభవాన్ని తీసుకురావాలనే ఆకాంక్ష తన కుమారుడు, ఎమ్మెల్యే రాజాకు ఉందన్నారు. కార్యక్రమంలో శ్రీలక్ష్మీ నారసింహస్వామి ఆలయ ధర్మకర్త ఎస్పీ రంగరాజ బట్టర్, రంగనాథ స్వామి ఆలయ ధర్మకర్త ఎస్పీ నరసింహ బట్టర్, అన్నవరం దేవస్థానం ఈఓ కె.రామచంద్రమోహన్, అన్నవరం దేవస్థానం ట్రస్టుబోర్డు సభ్యురాలు తాడి రజనీ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణలో వారే కీలకం : హోం మంత్రి తానేటి వనిత

విపత్తులు, అగ్ని ప్రమాదాల నివారణలో అగ్నిమాపక దళ సిబ్బంది కీలక బాధ్యతలు నిర్వర్తిస్తున్నారని హోం శాఖ మంత్రి తానేటి వనిత అన్నారు. కాపవరం ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో అగ్నిమాపక కేంద్రం, అగ్నిమాపక శకటాన్ని ఆమె ప్రారంభించారు. భవనంలోని అన్ని విభాగాలను ప్రారంభించడంతో పాటు, విపత్తుల్లో ఉపయోగించే పరికరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా అగ్నిమాపక దళం మాక్‌డ్రిల్ నిర్వహించింది. ఈ సందర్భంగా మంత్రి వనిత మాట్లాడుతూ అగ్నిమాపక దళం కేవలం అగ్ని ప్రమాదాలను నివారించడమే కాకుండా విపత్తుల్లోనూ సేవలు అందిస్తుందన్నారు. రూ.2.5 కోట్లతో అగ్నిమాపక కేంద్రం, విపత్తుల నివారణకు అవసరమైన సామగ్రిని రాష్ట్ర ప్రభుత్వం సమకూర్చిందన్నారు. నియోజకవర్గంలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు స్థానికుల కల అని, ఇది ఎమ్మెల్యే జక్కంపూడి రాజా తోడ్పాటుతో సాకారం అయ్యిందన్నారు. ఇక్కడ 19 మంది సిబ్బంది పనిచేస్తారన్నారు. రాష్ట్రంలో ప్రతి నియోజకవర్గంలో అగ్నిమాపక కేంద్రాల ఏర్పాటుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు తీసుకుంటున్నారన్నారు. సీఎం జగన్‌కు, ఎమ్మెల్యే జక్కంపూడి రాజాకు ప్రజల తరఫున ధన్యవాదాలు తెలిపారు. అగ్నిమాపక శాఖ అధికారులు శ్రీనివాస్, స్వామి, ఏఎంసీ చైర్మన్ నక్కా రాంబాబు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ అడపా కనకరాజు పాల్గొన్నారు.

మరణంలోనూ వీడని దాంపత్య బంధం

- భర్త మృతి చెందిన మూడు గంటల్లో భార్య మృతి
- తంటికొండలో హృదయ విదారక ఘటన



సత్యనారాయణ (ఫైల్)



వరలక్ష్మి (ఫైల్)



సత్యనారాయణ, వరలక్ష్మి మృతదేహాలు

గోకవరం: ధర్మేచ అర్థేచ కామేచ మోక్షేచ నాతిచరామి అనే మాటను నిజం చేసినట్టు.. భర్త మరణించిన కొద్ది గంటల్లోనే భార్యా తనువు చాలించిన ఘటన అందరినీ కలచివేసింది. వారిద్దరికీ వివాహమై 50 వసంతాలు నిండాయి. ఎంతో అన్యోన్యంగా జీవించేవారు. భర్తకు అన్నివిధాలా చేదోడు వాదోడుగా ఉండే ఆ భార్య.. భర్త మృతిని తట్టుకోలేక తనూ తనువు చాలించింది. తూర్పుగోదావరి జిల్లా గోకవరం మండలం తంటికొండ గ్రామంలో ఈ విషాద సంఘటన చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. తంటికొండ గ్రామానికి చెందిన కోసూరి సత్యనారాయణ (74), భార్య వరలక్ష్మి (70) కలిసి వడ్రంగి పని చేసుకుంటూ జీవించేవారు. వారికి 50 ఏళ్ల కిందట వివాహం జరిగింది. కుమార్తె, కుమారుడు ఉన్నారు. వారిద్దరికీ వివాహాలు జరిగాయి. సుమారు మూడు నెలల కిందట నుంచి అనారోగ్యంతో బాధపడుతున్న సత్యనారాయణ శనివారం రాత్రి సుమారు 7.30 గంటల ప్రాంతంలో మృతి చెందాడు. ఆయన మృతిని తట్టుకోలేని భార్య వరలక్ష్మి 10.30 గంటలకు గుండెపోటుతో ప్రాణాలు విడిచింది. భార్యాభర్తలిద్దరూ మూడు గంటల వ్యవధిలోనే మృతి చెందడంతో కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు దుఃఖ సాగరంలో మునిగిపోయారు. కులాచారం ప్రకారం ఆదివారం ఇద్దరి మృతదేహాలనూ ఒకే పాడెపై తీసుకుని వెళ్లి, ఒకే ప్రదేశంలో అంత్యక్రియలు జరిపారు.

స్కూటర్‌పై నుంచి జారిపడి వ్యక్తి దుర్మరణం



ప్రసన్నకుమార్ (ఫైల్)



ప్రసన్నకుమార్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు

నిడదవోలు రూరల్: స్కూటర్‌పై నుంచి ప్రమాదవశాత్తూ జారిపడి ఓ వ్యక్తి ఆదివారం మృతి చెందినట్లు సమిశ్రగూడెం ఎస్సై ఎస్ఎన్‌వీవీ రమేష్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండలంలోని శెట్టిపేట గ్రామానికి చెందిన మెరకనపల్లి ప్రసన్నకుమార్ (55), భార్య ప్రియదర్శిని, ఇద్దరు పిల్లలతో నిడదవోలులో నివాసం ఉంటున్నారు. నిడదవోలు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రసన్నకుమార్ ఇంగ్లిష్ లెక్చరర్‌గా పనిచేస్తున్నారు. వేలివెన్ను శశి కళాశాలలో ఇంటర్ ప్రాక్టికల్స్ పరీక్షలకు చీఫ్ సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహించేందుకు ఇంటి నుంచి ఎలక్ట్రికల్ స్కూటర్‌పై బయలుదేరి వెళుతుండగా సమిశ్రగూడెం శివారులోని హెడ్‌లాక్ వద్ద ప్రమాదవశాత్తూ జారిపడ్డారు. దీంతో తలకు తీవ్రగాయాలై ఘటనా స్థలంలోనే తన భర్త మృతి చెందినట్లు భార్య ప్రియదర్శిని ఫిర్యాదు ఇచ్చారు. ఈ మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడు ప్రమాదశాత్తూ పడిపోయాడా.. లేకుంటే ఇతర ఏ వాహనమైనా ఢీకొట్టిందా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు. లెక్చరర్ ప్రసన్నకుమార్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు ప్రభుత్వాసుపత్రిలో మృతుడి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ఈ ప్రమాద వివరాలు తెలుసుకుని వారిని ఓదార్చారు.

చెట్టును ఢీకొన్న బైక్

- ఇద్దరు యువకుల మృతి
- మరొకరి పరిస్థితి విషమం



సంఘటన స్థలంలో పడి ఉన్న యువకులు

ముమ్మిడివరం: మోటార్ సైకిల్ అదుపుతప్పి చెట్టును ఢీకొన్న ఘటనలో ఇద్దరు యువకులు మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన మరో యువకుడి పరిస్థితి విషమంగా ఉంది. ముమ్మిడివరం మండలం అనాతవరం శివారు గుబ్బలవారిపాలెం వద్ద ఆదివారం సాయంత్రం ఈ ప్రమాదం జరిగింది. అమలాపురానికి చెందిన అడబాల శ్రీసాయి హర్ష (23), యండమూరి లోకేష్, మామిడికుదురు మండలం పెదపట్నం గ్రామానికి చెందిన కొమ్ముల అనిల్ (21) గతంలో హైదరాబాద్‌లో ఉన్న సమయంలో స్నేహితులు. శ్రీసాయి హర్ష తండ్రి శ్రీనివాస్ ఒక ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీలో గుమస్తాగా పని చేస్తున్నాడు. ఆయన ఇద్దరు కుమారుల్లో హర్ష పెద్దవాడు. అలాగే కొమ్ముల లలిత, రాంబాబు దంపతుల ఇద్దరు కుమారుల్లో మరో మృతుడు అనిల్ పెద్ద కొడుకు. కొన్నాళ్లుగా గల్ఫ్‌లో ఉంటున్న ఇతడు రెండు నెలల కిందట ఇక్కడకు వచ్చి, ప్రస్తుతం అయినవిల్లి మండలం మాగాం గ్రామంలోని అమ్మమ్మ వడగన అమరావతి ఇంటి వద్ద ఉంటున్నాడు. హర్ష ఇటీవల బీటెక్ పూర్తి చేశాడు. ఈ నేపథ్యంలో ఐదు రోజుల క్రితం మోటారు బైక్ కొనుగోలు చేశాడు. ఈ బైక్‌పై హర్ష, లోకేష్‌లు మాగాంలో ఉంటున్న అనిల్ వద్దకు వెళ్లారు. అక్కడి నుంచి ముగ్గురు స్నేహితులు కలసి అమలాపురం వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో హర్ష అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన అనిల్‌ను అమలాపురం కిమ్స్ ఆసుపత్రికి తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. బీటెక్ పూర్తి చేసిన హర్ష ప్రయోజకుడై, కుటుంబాన్ని ఆదుకుంటాడని అనుకున్న సమయంలో అనంత లోకాలకు వెళ్లిపోవడంతో అతడి కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన లోకేష్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. అతడికి తల్లిదండ్రులు లేరు. ప్రస్తుతం మేనమామ శ్రీనివాస్ ఇంటి వద్ద ఉంటున్నాడు. హర్ష మృతదేహాన్ని ముమ్మిడివరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఎస్సై డి.సురేష్‌బాబు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

వాహన సేవ.. ఉత్సవ శోభ

- కనులపండువగా హంస, శేష వాహనాల సేవ
- అంతర్వేది సన్నిధిలో విశేష కార్యక్రమాలు



హంస వాహనంపై గ్రామోత్సవం



గరుత్మంతుడికి అర్చకుల పూజలు



ధ్వజారోహణ చేస్తున్న అర్చకులు

సఖినేటిపల్లి: అంతర్వేదిలోని లక్ష్మీనృసింహుని కల్యాణ మహోత్సవాల్లో భాగంగా మూడో రోజు ఆదివారం సాయంత్రం హంస వాహనంపై, రాత్రి శేష వాహనంపై శ్రీస్వామివారికి గ్రామోత్సవాలు అట్టహాసంగా జరిగాయి. అలాగే స్వామివారి సన్నిధిలో ప్రధాన అర్చకుడు పాణింగిపల్లి శ్రీనివాస కిరణ్ ఆధ్వర్యంలో స్థానాచార్య వింజమూరి రామరంగాచార్యులు, వేదపండితుడు చింతా వెంకటశాస్త్రి, అర్చక స్వాములు విశేష పూజాదికాలు నిర్వహించారు. తొలుత స్వామివారి సన్నిధిలో పుణ్యాహవచనం, వాస్తుపూజ, గరుత్మంతుని హోమం, అంకురార్పణ, ధూపసేవ, ధ్వజారోహణ, గరుత్మంతుని చిత్రపటం ఆవిష్కరణ వంటి విశేష కార్యక్రమాలు జరిపారు.

ఏడు రోజుల విష్ణుదీక్ష

సోమవారం నుంచి పౌర్ణమి వరకూ ఉత్సవాల నిర్వహణకు అర్చకులు ఏడు రోజుల విష్ణుదీక్ష తీసుకున్నారు. ఏటా ఈ దీక్ష చేపట్టడం ఆనవాయితీగా వస్తోంది. అర్చకులకు దీక్షా వస్త్రాలను ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ, చైర్మన్, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ రాజా కలిదిండి కుమార రామ గోపాలరాజా బహద్దూర్ అందజేశారు. స్వామివారి దీక్ష తీసుకున్న అర్చకులు భక్తిశ్రద్ధలతో అంకురార్పణ, ధ్వజారోహణ నిర్వహించారు. నవ ధాన్యాలను పుట్టమట్టిపై చల్లి, సర్వ దేవతలను ఆవాహన చేసి, ఏడు రోజుల పాటు అర్చనకు శ్రీకారం చుట్టారు. ఈ నవధాన్యాల నుంచి మొక్కలు ఎంత ఏపుగా ఎదిగితే అంతమేర గ్రామాలు పాడిపంటలతో సుభిక్షంగా ఉంటాయని పురాణ ప్రతీక.

ధ్వజారోహణ

స్వామివారి కల్యాణ మహోత్సవాలకు సకల దేవతలకు గరుత్మంతుని ద్వారా ఆహ్వానం పలుకుతూ ధ్వజస్తంభంపై ధ్వజపటం ఎగురవేయడమే ధ్వజారోహణ అని ప్రధాన అర్చకుడు శ్రీనివాస కిరణ్ తెలిపారు. కల్యాణ మహోత్సవాలకు దుష్టశక్తుల వల్ల ఎటువంటి అవరోధాలు లేకుండా ఉండేందుకు కూడా ధ్వజారోహణ చేస్తామని అన్నారు. ధ్వజస్తంభానికి మామిడి ఆకులు, దర్భలను కట్టి, గరుత్మంతుని చిత్రం గీసిన వస్త్రాన్ని అర్చకులు ఎగురవేశారు.

పంట కాలువలో కారు బోల్తా

- ఏడుగురిని రక్షించిన ఏఆర్ కానిస్టేబుల్, వలంటీర్
- మోటారు సైక్లిస్టుకు తీవ్ర గాయాలు
- క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించిన ఎమ్మెల్యే చిట్టిబాబు



పంట కాలువలో బోల్తా పడిన కారు



క్షతగాత్రులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు





ప్రయాణికులను కాపాడిన ఏఆర్ కానిస్టేబుల్ శ్రీనివాసరావు, వలంటీర్ నెల్లి లక్ష్మణరావు

పి.గన్నవరం: రాజవరం- పొదలాడ రోడ్డులో బెల్లంపూడి వద్ద ఆదివారం మధ్యాహ్నం ఓ కారు అదుపుతప్పి ఎదురుగా వస్తున్న మోటారు సైకిల్‌ను ఢీకొని ప్రధాన పంట కాలువలోకి దూసుకుపోయింది. అటుగా వెళ్తున్న ఏఆర్ కానిస్టేబుల్ కారు అద్దాలు పగులగొట్టి అందులో ఉన్న ఏడుగురిని గ్రామ వలంటీర్ సహకారంతో రక్షించారు. ప్రమాదంలో మోటారు సైక్లిస్ట్ యర్రంశెట్టి స్వామినాయుడుకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. రాజోలు మండలం శివకోడు గ్రామంలోని పెట్రోల్ బంకు యజమాని కసుమర్తి భాస్కర్ సందీప్‌కుమార్ తన కుటుంబంతో ఆదివారం ఉదయం రాజమహేంద్రవరం వెళ్లారు. తిరుగు ప్రయాణంలో సందీప్‌కుమార్, ఆయన భార్య సింధూ, కుమారుడు, కుమార్తె జయాన్స్, భాను, తల్లి పార్వతి కుమారి, అత్త, మామలు బిక్కిన సూర్యకాంతం, సుబ్బారాయుడు కారులో శివకోడు గ్రామానికి వస్తున్నారు. సందీప్ కుమార్ నడుపుతున్న కారు బెల్లంపూడి గ్రామం వద్ద అదుపుతప్పి ఎదురుగా వస్తున్న మోటార్ సైకిల్‌ను ఢీకొంది. అనంతరం ప్రధాన పంట కాలువలో పడి నీట మునిగింది. రాజమహేంద్రవరం ఎస్పీ కార్యాలయంలో పనిచేస్తున్న ఇసుకపూడికి చెందిన ఏఆర్ కానిస్టేబుల్ నెల్లి శ్రీనివాసరావు, అదే గ్రామానికి చెందిన వలంటీర్ నెల్లి లక్ష్మణరావు చింతావారిపేటలో జరిగిన ఫంక్షన్‌కు వెళ్లి వస్తున్నారు. ఈ ప్రమాదాన్ని గుర్తించి కానిస్టేబుల్ శ్రీనివాసరావు హుటాహుటిన కాలువలోకి దిగి కారు అద్దాలను పగులగొట్టి, అందులో చిక్కుకున్న ఏడుగురిని వలంటీర్ సహకారంతో రక్షించారు. కారులోని ఏడుగురికి స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మోటార్ సైక్లిస్టు తాడాలవారిపాలేనికి చెందిన యర్రంశెట్టి స్వామినాయుడు బెల్లంపూడిలో కిరాణా షాపు నిర్వహిస్తున్నారు. ఆయన ఇంటి నుంచి షాపునకు వెళ్తుండగా కారు ఢీకొంది. అదే సమయంలో అటుగా వెళ్తున్న పి.గన్నవరం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు తీవ్ర గాయాలైన స్వామినాయుడిని 108 అంబులెన్స్‌లో కొత్తపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కారులో ప్రయాణికులు మరో వాహనంలో ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లారు. బాధితులను రక్షించిన కానిస్టేబుల్ శ్రీనివాసరావు, వలంటీర్ లక్ష్మణరావులను ఎమ్మెల్యే చిట్టిబాబు అభినందించారు.

బషీర్‌బీబీ దర్గాకు పోటెత్తిన భక్తులు

- అట్టహాసంగా గంధోత్సవం
- కిక్కిరిసిన పొన్నాడ గ్రామం



దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న భక్తులు

కొత్తపల్లి: మత సామరస్యానికి చిహ్నంగా పేరొందిన పొన్నాడ బంగారు పాపమ్మ (బషీర్‌బీబీ ఔలియా) దర్గా వద్ద ఉరుసు ఉత్సవాలు ఆదివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తజనంతో ఆ ప్రాంతం నిండిపోయింది. బషీర్‌బీబీ 69వ ఉరుసు ఉత్సవాల సందర్భంగా చివరి రోజైన ఆదివారం వేలాది మంది భక్తులు తరలివచ్చారు. పోలీసుల భారీ బందోబస్తు నడుమ సుమారు 50 వేల మంది అమ్మవారిని దర్శించుకున్నట్లు దర్గా ముజావర్లు తెలిపారు.

ఈ ఉత్సవాల్లో భాగంగా గంధోత్సవం కనుల పండువగా జరిగింది. మూలపేటకు చెందిన షేక్ మౌలాసాహెబ్ ఇంటి నుంచి పెద్ద బొడ్డేపల్లికి చెందిన తాజుద్దీన్‌బాబా సమర్పించిన గంధాన్ని (సంథల్) ప్రత్యేకంగా అలంకరించిన గుర్రంపై ఉంచి ఫకీర్ మేళాతో మూలపేట నుంచి పొన్నాడ బషీర్‌బీబీ ఆలయం వరకూ ఊరేగించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. దారి పొడవునా భక్తులు బషీర్‌బీబీ గంధానికి పూజలు చేశారు. గంధోత్సవం అమ్మవారి దర్గాకు చేరుకున్న వెంటనే పాతేహాఖానీ నిర్వహించి అనంతరం అమ్మవారికి గంధాన్ని పూశారు. సంప్రదాయ ప్రార్థనల అనంతరం భక్తులకు గంధాన్ని పంపిణీ చేశారు.

రాష్ట్రం నలుమూలల నుంచి..

బషీర్‌బీబీ ఉత్సవాలకు రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు వచ్చారు. మూలపేట నుంచి పొన్నాడ వరకూ కాలినడకన వెళ్లేందుకు కూడా వీలులేకుండా మారింది. పలుమార్లు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. పిఠాపురం, తుని, కాకినాడల నుంచి వచ్చిన వాహనాలు పొన్నాడ చేరుకోవడానికి ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చింది. పిఠాపురం సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో కొత్తపల్లి ఎస్సై స్వామి నాయుడు, సుమారు 120 సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. వాహన రాకపోకలను క్రమబద్ధీకరించారు. అన్ని వాహనాలు ఆలయ ప్రాంగణం వద్దకు వెళ్లకుండా పొన్నాడ, అమరవిల్లి, నాగులపల్లి వద్దే నిలిపివేశారు.